## నవ్య వీక్లి - పసుపులేటి లక్ష్మీనారాయణ స్మృతిసాహితి కథల పోటీలో

## రూ. 2,500 తృతీయ బహుమతి పొందిన కథ

“ఈ సంసారాన్ని మరి నేనీదలేను” రోజుకు నాలుగుసార్లయినా పార్వతమ్మ అనుకునే మాట. ఇంతకు పూర్వం పైకనేది. ఇప్పుడు తనకు మాత్రమే వినపడేటట్టు అంటోంది. అలవాటు పడ్డాడు కాబట్టి ఆమె హావభావాల్ని బట్టి ఆమె అనుకునే మాటల్ని గ్రహించగలుగుతున్నాడు భర్త కామేశం.

ఆమె ఆ మాటల్ని పైకన్నప్పుడు అనేవాడు “ఇది భావసాగరం పార్వతీ ఈదక తప్పదు”

# విశ్రాంతి

జయంతి వెంకట రమణ

“మీకేమి మీరెన్ని మాటలైనా చెప్తారు; వాలు కుర్చీలో కూర్చుని పేపరు చదువుతు నాలుగుసార్లు కాఫీ త్రాగుతూ. ఉదయం నాలుగు గంటలనుండి గానుగెద్దులా రాత్రి పదకొండు వరకు, విశ్రాంతి లేకుండా, వంచిన నడుము ఎత్తడానికి కూడా నోచుకోకుండ నే పడుతున్న యాతనలు ఎవరికి తెలుస్తాయి? దేనికైనా హద్దు ఉంటుంది అంటారు. నా విషయంలో అది కనపడటం లేదు. కోడల్నీ అనడానికి వీల్లేదు. పిల్లల్ని భర్తని నిద్రలేపి వాళ్ళ అవసరాలు చూసి వాళ్ళని బయట పంపడానికే దానికి టైము సరిపోవటం లేదు. ఇక అమ్మాయి ఉందంటే - ఎంతసేపు దానికి కంప్యూటరు, సెల్లు, చదువంటు మోపెడ్ వేసుకుని అటు యిటు తిరగడానికే సరిపోతుంది. పైగా దాని అవసరాలన్నీ నేనే చూడాలి. అదెక్కడ, ఇదెక్కడ అని అరుస్తుంది. అప్పుడే అది ఇంజనీరైపోయినట్టు. నాకు వంటిల్లే పుస్తయిపోయింది. ఓ గుడీ లేదు. ఓ గోపురం లేదు...” ఇలా ఆమె మాటలు సాగుతూంటే; అర్థం చేసుకున్న కామేశం “కూరలు తరిగిపెట్టనా? పాలు మరగబెట్టనా! ఇంకా ఏమైనా పనులుంటే చెప్పు” అనేవాడు.

“వద్దు స్వామీ. మీరేం చేయొద్దు. పురుగులు, పుచ్చులు చూడక కూరలు తరిగేస్తారు. పాలు పొంగిపోయేంత వరకూ మీకా ధ్యాసే ఉండదు. తిరిగి అవన్నీ నే చూసుకోవాలి. అయినా ఇంతమంది ఆడవాళ్లున్నప్పుడు మీకా పనులెందుకు” కోడల్ని, కూతుర్నీ, అంటోందని అతనికి తెలుసు. చెప్పినా వాళ్లు చేయరనీ తెలుసు. అయినా ‘అమ్మకి పనుల్లో కాస్త సాయం చేయరాదుటే’ అంటాడు కూతురు సుమతో. “నాకవదండి నాన్నగారు. నాకసలే బోలెడు కాలేజి వర్కుంది. ఆవిడగారికి చెప్పి చేయించు కోమనండి. టీ.వీ. చూడ్డం, పుస్తకాలు చదవడం తప్ప ఆవిడగారు చేసే పనులేమున్నాయట” అంటుంది నిర్మొహమాటంగా.

ఇక ఆమె స్నానానికి లేచి, కాలేజీకి వెళ్లేంతవరకు అన్నీ అందిస్తూ, సణుగుడు భరిస్తూ వంటింటికి, కూతురు గదికి పరుగులు వేయాల్సిందే. ఏది తక్కువైనా కథాకళి నాట్యం చేస్తుంది.

కోడలు రాజేశ్వరి పనుల్లో కలుగజేసుకోదుగాని “మీరు సుమని మరీ ముద్దు చేస్తున్నారు అత్తయ్య! పెళ్లయి అత్తవారింట కెళ్లాల్సిన పిల్ల పెరిగే దలాగేనా?” అని అంటుంది. ఈ మాటల్ని సుమగాని విన్నదంటే ఆ రోజు ఆ యింట్లో భీకర యుద్ధమే. కూతుర్నేమనలేదు. కోడల్నీ ఏమనలేదు. ఆమె తన తమ్ముడి కూతురు. పైగా తల్లి లేనిది. సుమ లేనప్పుడు పార్వతమ్మ అంటుంది, “ఒక వయసు వచ్చిన తరువాత ఎవరి బాధ్యతలు వాళ్ళు తెలుసుకోవాలి” అని.

ఇటీవల ఆమె మాటలు కొత్తరాగంలోకి మళ్ళాయి. “ఈ నరకంలో ఉండడం కన్నా ఎక్కడికైనా పారిపోవాలని ఉంది” అంటూ. ఆమె మాటలు అర్థం చేసుకున్న కామేశం “ఎక్కడికి పోదామంటావు చెప్పు” అనేశాడోసారి.

“పోదాం. పోదాం అంటారేమిటి? పోదామనుకుంటున్నది నేను మీకేం? మీరిక్కడే ఉండండి. కూతురు కోడలు మిమ్మల్ని బంగారంలా చూచుకుంటారు. నా ముఖం చూస్తేనే ఎవరికీ పని చేయబుద్ధి పుట్టదు” అంది. కామేశం కాసేపాగి ఆమె ముఖంలో ఆవేశం తగ్గిన తరువాత “ఎప్పుడైనా, ఎక్కడైనా, యిన్నేళ్ళలో మనం విడివిడిగా ఉన్నామా చెప్పు” అన్నాడు లాలనగా ఆమె ముఖంలోకి చూస్తూ.

“నిజమేలెండి. ప్రాణం విసుగెత్తి అలా అన్నాను. మిమ్మల్ని విడిచి నేనెక్కడికి వెళ్ళగలను చెప్పండి” అంది భర్త ముఖంలో దీనత్వం చూచి

“లేదు. పార్వతీ. ఇద్దరం కలిసే వెళ్దాం. కొన్నాళ్ల పాటు పెద్దవాడి దగ్గరికి వెళ్ళి ఉందాం. తరవాత అక్కడే ఉన్న పెద్దదాని దగ్గరికి, హైదరాబాద్, నాకూ విసుగ్గానే ఉంది” అంటూ ఆ రోజే పెద్ద కొడుకు సీతారాంకి ఫోన్ చేశాడు.

“అదేంటి నాన్నగారూ అలా అంటారు. నేనే మిమ్మల్ని పిలుద్దామనుకుంటున్నాను. మీరెంత కాలమున్నా నాకభ్యంతరం లేదు. రిజర్వేషన్ అవగానే ఫోన్ చేయండి” అన్నాడు. కొడుకు దగ్గర నుండి గ్రీన్ సిగ్నల్ రాగానే, కామేశం రిజర్వేషన్ కోసం ప్రయత్నించడం, రిజర్వేషన్ దొరకడం, ఆ వారంలోనే ప్రయాణానికి సన్నద్ధమవడం జరిగిపోయాయి.

“ఏమిటమ్మా! ఇంత హఠాత్తుగా ఈ ప్రయాణం” అడిగింది సుమ రాత్రి భోజనాల సమయంలో. అదే ప్రశ్న చెల్లాయి అడగడంతో తండ్రివేపు చూశాడు రాజారాం.

“ఏమిటో వాళ్ళను చూడాలనిపిస్తోందీ మధ్య. ఏడెనిమిది నెలలక్రితం వాడిని, పిల్లల్ని గృహప్రవేశమప్పుడు చూడటమే” అంది పార్వతమ్మ.

“వాళ్ళకీ మిమ్మల్ని చూడాలనిపించాలిగా. ఏదీ! ఆనాటినుండి ఈరోజు వరకూ ఒక్క ఫోనైనా చేశాడా? రమ్మన్నాడా?” నిష్ఠూరంగా అన్నాడు కొడుకు “మేం తల్లిదండ్రులం. మా కందరూ కావాలి. అయినా

అక్కడ ఉండిపోంగా.''

తల్లి అలా అనేసరికి రాజారాం ఏమీ మాటాడలేక పోయాడు. రాత్రి కూతురుతో అంది ''నీ దిగులు నాకు తెలుసు. నీ పనులు నీవు చేయడం నేర్చుకో. అమ్మానాన్న ఎల్లకాలం మీతో ఉండరు. సర్దుకోవడం నేర్చుకుంటే పెద్ద అనేది ఇంట్లో లేదు. అక్కడైనా మమ్మల్ని ప్రశాంతంగా ఉండనీయండి'' అని.

''త్వరగా వచ్చేయండి అత్తయ్యా'' అని మాత్రం అంది రాజేశ్వరి ట్రయిన్ కదులుతూంటే.

తల్లిదండ్రుల రాకకు ఎంతగానో సంతోషించాడు సీతారాం.

''ఇంతకాలానికి పెద్దకొడుకుని చూడాలనిపించిందాండి అత్తయ్యగారూ'' అంది పెద్దకోడలు విమల. అది నిష్ఠూరమని తెలుసామెకి. సమాధానమెలా చెప్పాలోకూడా తెలుసు. కాని మాటల యుద్ధంతో యింట్లో అడుగు పెట్టడం ఆమెకిష్టంలేదు.

అందుకే ''ముందు ఇంట్లో అడుగుపెట్టనియ్యమ్మా కోడలు పిల్లా. తరువాత అన్నీ మాటాడుకుందాం'' అంది నవ్వేస్తూ.

''అయ్యయ్యో! మిమ్మల్ని వీధిలోనే నిలబెట్టేశానా? రండి రండి'' అంటూ స్వాగతించింది. పెళ్ళయిన దగ్గర నుండి రాజారామ్ తల్లిదండ్రులతోనే ఉన్నాడు. ఉద్యోగ రీత్యా సీతారాం ఎప్పుడు దూరంగా ఉండడం చేత, వాళ్లింటిలో రోజుల తరబడి ఉండే అవకాశమే రాలేదు పార్వతమ్మ కామేశాలకి. వారాల తరబడి ఎక్కువ ఉండేది కొడుకు, కోడలు, పిల్లలు వీళ్ళదగ్గరే. పెద్ద తోటి కోడలు, పిల్లలకోసం, చిన్నామె ఎందుకు చేయాలి? అందుకే పార్వతమ్మదే మొత్తం పనంతా.

ఆ సాయంత్రం ఇల్లంతా కలియతిరుగుతూ ''గృహ ప్రవేశమప్పుడు సరిగ్గా చూడ్డం అవలేదు గాని, మూడు పడక గదులతో, అన్ని సౌకర్యాలతో చాలా బాగుందే అమ్మాయి, యిల్లు'' అంది మెచ్చుకుంటు.

''బాగుంది గానండత్తయ్యగారూ. ఇప్పుడనిపిస్తోంది చిన్న యిల్లయితే బాగుండేదేమోనని. ప్రతీనెల బ్యాంకులోను వేలల్లో కట్టడం చాలా కష్టంగా ఉంది. దిగిన తరువాత తప్పదుగా. అందుకే నేనూ ఉద్యోగంలో చేరక తప్పలేదు. పార్టుటైమ్ లెక్చరర్‌గా. పార్టుటైమన్న మాటేగాని చచ్చే చాకిరీ చేయిస్తున్నారనుకోండి. అదికాక సాయంత్రం కంప్యూటరు క్లాసులకి ఎటండవుతున్నా. ఊపిరి సలపటం లేదనుకోండి. ఓ ప్రక్క ఎదిగీ ఎదగని పిల్లలు, చదువులు, వాళ్ళను కనిపెట్టుకోడాలు. ప్రాణం విసిగిపోతోందనుకోండి'' అంది విమల.

''ఇప్పుడే ఇలా అంటే ఎలా? సంసారం అన్న తరువాత ఇవన్నీ తప్పవు. ఇప్పుడు కష్టపడితే రేపు కాస్తయినా సుఖపడతావేమోననే ఆశ. ఆ ఆశతోనే కదమ్మా నలుగురు పిల్లల్ని పెంచి పెద్ద చేసింది. కూతురు రెండు పురుళ్ళతోపాటు, మీ ఇద్దరి కోడళ్ళ పురుళ్లు నా బాధ్యతే అయ్యాయా తల్లి లేని పిల్లని దాన్ని, వైద్య సదుపాయంలేదని నిన్ను నా దగ్గర పెట్టుకోవలసి వచ్చిందా లేదా! ఇంత చేసినా ఆయన రిటైరయినా బాధ్యతలు తీరాయా; ఇంకా సుమ పెళ్లికుంది. దాని చదువయ్యే దెప్పుడు? పెళ్ళయ్యేదెప్పుడు? ఏది ఏమైనా రిటైర్‌మెంటు తరువాత వచ్చిన డబ్బు మీకందరికీ పంచినట్టుగా దాని పేరిట కొంత ఉంచాం. చాలకపోతే అప్పు చేసైనా చేస్తాం. కొడుకుల్ని ఈ విషయంలో బాధించే ఉద్దేశం ఆయనకి లేదు. నీవు చదువుకున్నావ్. అందుకని ఉద్యోగం చేసే అవసరమూ లేదు. ఇల్లు, పిల్లల్ని వాడిని జాగ్రత్తగా చూచుకుంటే అంతకన్నా ఫిక్స్‌డ్ డిపాజిట్ ఏదీ ఉండదు. పిల్లలు ఓ స్థాయికొచ్చిన తరువాత నీ యిష్టం'' అంది పార్వతమ్మ. విమల విన్నదిగాని ఏమనలేదు.

మర్నాటి ఉదయం విమల పనులతో సతమతమవుతు, పిల్లల్ని కసురుతు, కిచెన్ ఆర్కెస్ట్రా వినిపిస్తూంటే చూస్తూ కూర్చోలేకపోయింది పార్వతమ్మ ''నాకూ పనులు చెప్పమ్మా; చేసి పెడతాను'' అంది.

''ఎన్ని పనులని చెప్పమంటారు. పిల్లల్ని తయారు చేయాలి. వాళ్ళకీ టిఫిన్ తయారుచేసి అందివ్వాలి. నేను తయారై ఇంత టిఫిన్ బాక్సులో పెట్టుకుని ఏడున్నర కల్లా పరుగెత్తాలి.''

''మరి వంట........''

''రోజూ ఆయన వంట చేసి తనింత తిని, కేరియర్ సర్దుకుని, పిల్లల్ని పంపించి బ్యాంకు కెళ్ళిపోతారు. నేను కేంటీనులో తింటాను'' అంది విమల.

''ఇదేం విడ్డూరమే తల్లీ! వాడు ఏనాడైనా గరిటె పట్టుకున్నాడా! వాడు వండుకుని తినడమేమిటి? నీవు బయట తినడమేమిటి? బయటి వాళ్ళను పోషించడమేమిటి? ఇదిలా అయ్యేపని కాదు. ఇవాల్టికి టిఫిన్ పట్టుకెళ్ళిపో వంటపని నేను చూసుకుంటాను''

''బాగుందత్తయ్యగారూ! మీకు మేం చేయడం పోయి, మీరు మాకు చేయడమా? మీ అబ్బాయి వింటే ఊరుకోరు''

''ఎల్లకాలం చేస్తామనటం లేదు. మేమున్నంత కాలం ముందు ఫ్రిజ్‌లోంచి కూరలు తీసి పడేయి. నేను వంటపని చేసుకుంటాను'' అంటు వంటలోకి జొరబడింది పార్వతమ్మ. విమల కాలేజీకి పరుగెత్తింది.

కేరియరు కడుతున్న తల్లిని చూసి, టిఫిన్ తినడం ఆపుచేసి ''నీవు టిఫిన్ కేరియరు కడుతున్నావేమమ్మా! విమీ ఏమైంది?'' అడిగాడు సీతారాం.

''ఉదయమే కాలేజికెళ్లిందిగా''


''ఇంత తొందరగానా? అయినా రోజూ నేను డ్రాప్ చేస్తున్నాగా. తన క్లాసులు పదకొండు తరువాత కదా?'' ఆలోచిస్తూ అన్నాడు.

''నాకేం తెలుస్తుందిరా. కంప్యూటర్ క్లాసంది. సాయంత్రం త్వరగా వస్తుందేమో''

పిల్లలు, స్కూళ్ళకి అంతకుముందే వెళ్ళిపోయారు. కామేశం అంతా గమనించాడు. కాని భార్యనేమీ అడగలేదు. సాయత్రం అయిదు దాటిన తరువాత వచ్చింది విమల. స్నానం చేసి వచ్చి, పిల్ల చదువు దగ్గర కూర్చుంది గాని వంట ప్రయత్నమేమీ చేయలేదు. ఉండబట్టలేక ''రాత్రి వంట ఏం చేద్దాం'' అని అడిగేసింది పార్వతమ్మ.

''చేయడానికేముంది? ఉదయం మిగిలిన అన్నం వేడి చేసుకుని, ఉన్నవాటితో సర్దుకు తినేయడమే''

''ఇలా వేడిచేసుకొని



తినడాలు మనిళ్ళలో ఉన్నాయా? ఇదేం అలవాటు!”


“మరేం చెయ్యమంటారు? ఈ రోజుల్లో రెండు పూటలా కిచెన్‌లో మగ్గడానికి ఎవరికి మాత్రం వీలవుతోంది? అందరిళ్ళలోనూ అంతే”

“టైము లేదని కదమ్మా నీ బాధ. సాయంత్రం వంట కూడా నేనే చేస్తాలే. ఇలా వేడి చేసుకొని తినడాలు మీ మామయ్యకిష్టముండదు” అంటుంటే...

“మీ అబ్బాయికీ యిష్టముండదు. కాని ఏం చేస్తాం. తప్పటంలేదు” అంది విమల తేలిగ్గా.

పార్వతమ్మ మాటాడకుండా కుక్కరు స్టౌ మీద కెక్కించి, కందిపప్పు వేయించి పచ్చడి చేసి, నాలుగు బంగాళదుంపల్ని వెతికి వేయించింది.

“ఏంటమ్మా! ఈ రోజంతా స్పెషల్‌గా ఉంది. వేడి వేడి భోజనం. కందిపచ్చడి. అదిరిందనుకో. వెల్లుల్లి వేశావేమో మంచి రుచి వచ్చింది. మరికొద్దిగ వెయ్యి” అంటు మరో వాయి కలుపుకొని తిన్నాడు సీతారాం. “అవును నాన్నమ్మా” అంటూ పిల్లలు యిష్టపడి తిన్నారు. విమల ముఖం ముడుచుకుని భోజనం అయిందనిపించింది.



భోజనాల తరువాత వంటిల్లు సర్దుకుని వచ్చి పడుకోబోయేముందు భర్తతో అంది పార్వతమ్మ “తిండికి ఎంత వాచిపోయాడో కన్న ఎంత ఆత్రంగా తిన్నాడో చూశారా”

“ఇకనేం. ఆ కోడలికి చేసి వచ్చావుగా. ఇక ఇక్కడ ఆ పోష్టులో స్థిరపడిపో. నీ ఉద్యోగానికి రిట్రెంచిమెంటు లేదు. రిటైర్‌మెంట్ అంతకన్నాలేదు. నీవొచ్చావని పనులెంత చక్కగా ఒప్పగించిందో చూశావా” అన్నాడు కామేశం.

“ఏం చేస్తాం చెప్పండి కన్నపేగు”

“నిజమే. కాదనలేదు. ఆడవాళ్లు పనులు పంచుకుని సహకరించుకోవాలని తెలీదా ఆ పిల్లకి? ఉద్యోగం చేసే ఆడవాళ్ళందరూ యిలానే ఉన్నారా? అసలు మనం రావడం యిష్టం లేదేమో”

“అయ్యో! అదేం మాటండి. అయినా పాలకోసం రాళ్ళను మోయాలి తప్పదు” అంది.

అదే రాత్రి పడకగదిలో భార్యని నిలదీసి అడిగాడు సీతారాం. “ఎప్పుడూ లేనిది ఈ రోజు టైం టేబిల్ మార్చావేమిటి? అమ్మను వంటగదిలో కుక్కి అంత ఉదయాన్నే కాలేజి కని వెళ్ళాల్సిన పనేమొచ్చింది? కంప్యూటర్ క్లాసులని కొత్తగ ఎప్పుడు మొదలు పెట్టావ్? అదిమాత్రం ఎన్ని గంటలని? మనం అక్కడ ఎన్నాళ్ళున్నా, ఎవరినీ పని ముట్టుకోనీకుండ, అందరికీ అమర్చి పెట్టింది అమ్మ. వాళ్ళు మనింటికొచ్చినపుడు చేసిపెట్టే బాధ్యత మనకు లేదా?” అని.

“నేను ఎప్పటినుండో కంప్యూటర్ క్లాసులకి ఎటండవాలనే అనుకుంటున్నాను. నాకు నా కెరియర్ ముఖ్యం. ఎవరెవరికో చేసి పెట్టాల్సిన పనేమీ లేదు. అక్కడ ఆ కోడల్ని కూర్చోపెట్టి చేస్తున్నప్పుడు ఇక్కడ కొడుకు పిల్లలకి చేయడానికే కష్టం వచ్చిందట. అయినా నా వంటలు వాళ్లెవరికీ నచ్చవు. అర్థం చేసుకోండంతే. మరి నన్ను విసిగించకండి” అంటూ ముసుగు తన్నింది విమల.

టైం టేబిల్ తెలిసింది కాబట్టి ఉదయాన్నే పనుల్లోకి జొరబడింది పార్వతమ్మ. 'పనిలో తోడు పడనా' అని అడగకుండా కాలేజీకని టిఫిన్ చేసి కేరియర్ పట్టుకుని బయలుదేరింది విమల

“అత్తయ్యగారూ మీరు వున్నన్నాళ్ళు మీకిష్టమొచ్చినట్లు వండండి. నాకు చేతకావుగానీ మీవంటలంటే నాకు చాలా యిష్టం” అంది వెళ్తూ.

“నీవు తొందరగా తెమిలితే కోడల్ని నీతో తీసికెళ్లేవాడివిగా” అంది కొడుకుతో పార్వతమ్మ.

“ఉద్యోగాలన్న తరువాత ఎవరి దారి వారిదమ్మా” అన్నాడు సీతారాం. భార్య మీది కోపాన్ని బయటికి రానీకుండా.

తల్లీతండ్రి వచ్చారని తెలిసి ఆ మధ్యాహ్నమే పరుగెత్తుకొచ్చింది శారద. పలకరింపులు పరామర్శలు అయిన తరువాత తల్లి దగ్గరగా చేరి ఆమె భుజాల చుట్టూ చేతులేసి “నీకో శుభవార్తమ్మా” అంటూ గుసగుసలాడింది.

“ఇంతవరకు చెప్పలేదేమే. అయినా యిద్దరి తరువాత వద్దనుకున్నారు కదే. మళ్ళా యిప్పుడేమిటి?”

“ఆయనకు మగపిల్లాడు కావాలటమ్మా. నాకూనూ”

“కావచ్చే. కానీ ఈసారీ ఆడపిల్లయితే. మీ ఆయనేమో సముద్రాల అవతల. మీ అత్తామావలేమో కాశీ రామేశ్వరాల మధ్య వారధి కట్టి అక్కడి నీళ్ళు యిక్కడ యిక్కడ నీళ్ళు అక్కడ గుమ్మరిస్తూ భారతదేశమంతా పావనం చేయడంలో తరిస్తున్నారు కదే. ఇక్కడ నిన్ను చూచేదెవరు? చేసేదెవరు?.... సుఖానున్న ప్రాణాన్ని...”

“ఆ సమయానికి ఆయనా వచ్చేస్తారమ్మ. వాళ్ళూ వస్తారు. అందాక నీవున్నావ్. నాకేం భయం. ఈ డెలివరీ అయిపోగానే పెద్దవాళ్ళనిద్దర్నీ నీ దగ్గర వదిలేసి నేనూ ఆయనతో అమెరికా వెళ్ళిపోతాను. అక్కడ నాకూ ఉద్యోగమొస్తుంది బాగా సంపాదించుకుని అయిదారేళ్ళు పోయిన తరువాత వస్తాం” అంటూ ఎన్నో చెప్పింది. ఆమె మాటల్లో అమెరికా, డాలర్లు తప్ప, ఇండియా (భారతదేశమని యిప్పుడెవరంటున్నారని) రూపాయలు ధ్వనించలేదు. 'తనచుట్టూ వున్న ప్రపంచం మారుతోందనుకుంది గాని తనింటిలో కూడా ఇంత మార్పా. మనం ఎవరి చేతుల్లో ఉన్నాం. మన స్వేచ్ఛ ఏమయింది. స్వాతంత్ర్యం ముందులాగ; ఇప్పుడు యిలాగ ఎక్కడికి మన పరుగు' అని ఆవేదన పడింది పార్వతమ్మ. మూడు అవగానే పిల్లలు స్కూళ్ళ నుండి వచ్చేస్తారని ఆటో ఎక్కేసింది శారద. ఉన్న నాలుగ్గంటల్లో ఓ గ్లాసుడు మంచినీళ్ళు, ఓ కప్పు కాఫీ తప్ప ఏమీ యివ్వలేకపోయింది పార్వతమ్మ. చేసి పెడదామన్నా యింట్లో ఎక్కడా ఉప్మారవ్వైనా కనిపంచలేదు. కడుపుతో ఉన్న పిల్లకి ఏమీ చేసి పెట్టలేకపోయానే అని బాధపడటం తప్ప మరేమీ చేయలేకపోయింది.

ఓ వారం పోయిన తరువాత

రాత్రి భోజనాల దగ్గర “ఓ నాలుగు రోజులు దాని దగ్గరుండి, వండిపెట్టి వస్తానురా. నెలలు పైబడుతున్నాయి కదా. ఎవరైనా చేసి పెడితే తినాలని ఉంటుంది” అంది కొడుకుతో. సీతారాం పెదవి కదల్చకముందే.

“అయితే వచ్చింది మమ్మల్ని చూడటం కోసం కాదన్నమాట” అంది విమల.

సీతారాం భార్య ముఖంలోకై చూశాడు గానీ ఏమనలేదు.

“అదేంటమ్మా! అలా అంటావు? నాకు ఎవరైనా ఒకటే. కాకపోతే దాని పరిస్థితి వేరు”

“ఏం ఫరవాలేదు. మీరిక్కడే ఉండండి” అంది తలెత్తకుండానే.

కామేశం భార్యవంక చూశాడు .పార్వతమ్మ నోరు మెదపలేదు.

రెండు రోజులు పోయిన తరువాత "మీరందరూ స్కూళ్ళకి, ఆఫీసులకి వెళ్ళిన తరువాత దాని దగ్గరకెళ్లి కాసేపు కూర్చుని మళ్ళా మీరొచ్చేవేళకు వచ్చేస్తారా" అంది పార్వతమ్మ. తల్లి అంత దీనంగా అడుగుతూంటే సీతారాం మనసు అదోలా అయింది.

"ఏంటమ్మా ఈ మాటలు. శారద నీకెంతో నాకూ అంతే. డబ్బు ఖర్చు అటుంచి, ఇక్కడ బస్సుల్లో, ఆటోల్లో ప్రయాణం అంత సుఖం కాదమ్మా. ఇదేం వైజాగ్ కాదు. మనమో మూల అదో మూల. నాలుగు రోజులు పోయాక నేనే అక్కడికి పంపిస్తాను. ఉండాలన్నాళ్ళు ఉండి రండి" అని అన్నాడు. అన్నాడే కాని వారమైనా నోరు మెదపలేదు.

"ఇదయ్యే పనికాదు" అని యింటికి తాళాలు వేసి భార్యను తీసుకుని కూతురు దగ్గరికి బయలుదేరాడు కామేశం. తల్లీతండ్రిని చూచి ఆనందించింది. దారిలో వాళ్లు కొనితెచ్చిన పళ్ళు స్వీట్లు అందుకుంటూ 'మా మంచి అమ్మ' అంటు ముద్దు పెట్టేసింది.

"ముద్దులు తరువాత కానీ, మళ్ళీ మేం నాలుగులోగా వెళ్ళిపోవాలి. నీకేం కావాలో చెప్పు చేసిపెడతాను" అంది. "అప్పుడే వెళ్ళిపోతారా? నేవెళ్ళనిస్తానా? అయితే మినపసున్ని కావాలి. రాగానే జోళ్ళేసుకుని పావుగంటలో కావలసినవన్నీ తెచ్చాడు కామేశం. వెంటనే పార్వతమ్మ పనిలో జొరబడి పని చేస్తుంటే వేగుతున్న మినుముల వాసనలను పీలుస్తూ "అమ్మా! నిజంగా మనింటిలో ఉన్నట్టుందే ఈ వాసనలు పీలుస్తూంటే" అంది శారద

"నిజమే. మనిషితోపాటు జన్మ జన్మల వాసనలు ఎలా సంక్రమించి, మనిషినుండి మనిషికి ఆ వంశంలో వ్యాపిస్తూ పోతాయో; ఈ వాసనలూ అంతే. సంస్కారాన్ని బట్టే ఇవీనూ. బయటి తిళ్ళకి అలవాటు పడ్డ మీకు ఇవేమీ అర్థం కావు" అంది.

"నేనూ నేర్చుకుంటాలే అమ్మా! నాకు రానిదేం కాదు" అంటు తల్లికి సహకరించింది ఓ సున్నుండ తన చేతితో కూతురికి తినిపించి, ఓ సీసానిండా నింపి, మరికొన్నింటిని 'మీ అన్నావాళ్లకే' అంటుపట్టుకుని బయలుదేరింది భర్తతో ఆదరాబాదరాగా.

ఇంటికి చేరేసరికి విమల వచ్చేసింది అప్పటికే.

"ఎక్కడికో వెళ్ళినట్టున్నారు" అంది. పార్వతమ్మ మినపసున్నుండల సీసా టేబిల్ మీద పెడుతూ అంతా వివరంగా చెప్పింది. విమల ఏం మాటాడలేదు గాని భర్తతో ఏం చెప్పిందో సీతారాం అడిగేశాడు "ఇల్లలా వదలివెళ్ళడం మంచిది కాదమ్మా. పట్టపగలే ఇళ్లు దోచేస్తున్నారు" అని.

"మరి మేము ఇక్కడికి రాకముందు ఇంటికి వుండేది తాళమేకదా" అని అనబోయి ఊరుకుంది పార్వతమ్మ.

"ఇక నేనే వెళ్తాను రెండు మూడు రోజులకోసారి. నన్ను బస్సెక్కించండి చాలు. దారి నాకు తెలిసింది కదా. నాకేం భయం" అందా రాత్రి భర్తతో.

"అది కాదు పార్వతీ. ఉదయం నుండి యిక్కడ పనిచేసి మళ్ళీ అక్కడ కెళ్ళి అక్కడ పనిచేసి తిరిగి వచ్చి మళ్ళా యిక్కడ... అంత సులభం అనుకుంటున్నావా? ఎంత శ్రమో ఆలోచించు' అన్నాడు.

"అలవాటయితే ఏదీ శ్రమలేదు" అంది.

మరో రెండు రోజులు పోయిన తరువాత 'జాగ్రత్త, వెళ్ళగానే ఫోన్ చెయ్యి' అంటూ అయిష్టంగా పార్వతమ్మను బస్సెక్కించి, ఎక్కడెక్కడ ఏ బస్సు మారాలో చెప్పి యింటికి చేరి ఫోన్ దగ్గరే కూర్చుండిపోయాడు. ఓ గంటన్నర తరువాత చేరినట్టు ఫోన్ చేసింది, కాని సాయంత్రం అయిదు దాటినా భార్య జాడ కనపడలేదు. కూతురికి ఫోన్ చేశాడు.

'అమ్మ ఎప్పుడో బయలుదేరిపోయిందం'ది. కామేశానికి కంగారెక్కువైంది. ఇంతలో విమల పిల్లలు వచ్చేశారు.

"అత్తగారేరి? వరండాలో జోళ్ళు కనపడటం లేదు" అంటూ అడిగేసింది.

"శారద దగ్గరికెళ్ళింది"

"మరి మీరు..."

"ఇంటికాపలా కుండిపోయాను" అన్నాడు. విమల ఏమనక బాత్‌రూములోకి వెళ్ళిపోయింది. కామేశం ఉండబట్టలేక జోళ్ళేసుకుని బయలుదేరబోతూంటే వచ్చేసింది పార్వతమ్మ. గబగబా ఎదురెళ్ళి మంచినీళ్ళగ్లాసందించాడు రిలీఫ్‌గా. వస్తూనే కాళ్ళు కడుక్కుని వంటగదిలోకి జొరబడి 'కాఫీ' కలిపి కప్పుల్లో నింపి, పిల్లలికి బోర్నవిటా కలిపి టీపాయి మీదపెట్టి 'టిఫిన్ ఏదైనా చేస్తాను' అని అంటూండగా విమల వచ్చి 'అయ్యో! కాఫీ మీరే కలిపారా? నే చేద్దును కదా' అంటూ కాఫీ కప్పు అందుకుంది.

శారద గురించి విమల అడగలేదు; పార్వతమ్మా చెప్పలేదు. రాత్రి భర్తతో అంది 'శారద తన సెల్ ఫోన్ నాకిచ్చేసింది. తను వేరే కొనుక్కుంటుందట. ఇక రోజు దానితో మాటాడొచ్చు. మీరు రాలేదని బాధ పడింది, రేపు మీరు వెళ్ళండి" అంటు ఎన్నో కబుర్లు చెప్పింది. అంతా విని "బాగా అలసి పోతున్నావు పార్వతీ. ఇలా అయితే ఆరోగ్యం చెడిపోతుంది సుమా" అంటూ హెచ్చరించాడు.

"నెలరోజులే. ఈలోగా వాళ్ళ అత్తామామలు వచ్చేస్తారు" అంది.

"అమాయకురాలా! సరే, పడుకో మళ్ళా; ఉదయాన్నే లేవాలి" అంటూ ఆమె గుండెవరకు దుప్పటి కప్పి తనూ మేను వాల్చాడు.

కూతురు సెల్‌ఫోన్ యిచ్చినందుకు పార్వతమ్మ సంతోషించిందేమో గాని, విమలకు విసుగ్గానే వుంది. 'కోతికి కొబ్బరికాయ దొరికినట్టు' అంటూ విసుక్కుంది. తల్లి గారాబం ఎక్కువవడంతో శారద తన కోర్కెలనన్నీ సెల్‌ఫోన్‌లో చెప్పసాగింది. ఓ రోజు ఉల్లి పెసరట్టు, ఇంకో రోజు కందాబచ్చలి కూర.. మరో నాడు రవ్వలాడు.... ఇలా.

"పిచ్చిపిల్లా' అంటు కూతురితో కోర్కెల కనుగుణంగా మసలుకోసాగిందా తల్లి. అంచేత రోజు విడిచి రోజైనా కూతురి దగ్గరకెళ్ళవలసి వచ్చేది


"ఓహో! ఏం నయగారాలు. తొలి కాన్పులా!" అని విమల ఈసడించినా పార్వతమ్మ లెక్కచేయలేదు. ఓ రోజు ట్రాఫిక్ జామ్‌వల్ల ఆమె యిల్లు చేరేసరికి రాత్రయిపోయింది. సీతారాం తల్లిమీద చాలా చిరాకు పడ్డాడు. "ఉంటే యిక్కడైనా ఉండు. లేదా కూతురి దగ్గరకెళ్ళిపో. నాకీ టెన్షన్ వద్దు. ఫోన్ చేసినా ఫోనెత్తవేం. నీవు బయలుదేరిపోయావని అదంటుంది" అంటే

"సెల్ ఛార్జింగ్‌లో లేదురా. లేకపోతే చేయనూ? నాలుగు రోజులవరకు వెళ్ళనులే" అంది. అందికాని ఆ మర్నాడే భర్తను తీసుకుని ఆటోలో పరుగెత్తవలసి వచ్చింది. నడుము నొప్పిగా ఉందని శారద ఫోన్ చేస్తే.

"మామూలు నొప్పి తప్ప మరేం కాదు" అంటూ పెయిన్ బామ్ రాసి కాస్త తగ్గిందనగానే భర్తతో ఆటోలోనే తిరిగి వచ్చింది. అప్పటికి విమల రాలేదు. వచ్చి వుంటే పెద్ద యుద్ధమే అయ్యేది. 'ఇంటికి తాళం వేసి వెళ్తారా?' అని కయ్యమాడేది.

"పెద్దాడు అన్నట్టు ఈ తిరుగుడు వద్దు. అక్కడికే వెళ్ళి ఉందాం. అసలక్కడ పిల్ల ఒంటరితనంతో బాధ పడుతోంది" అన్నాడు కామేశం నాలుగురోజులు పోయి. "మీకర్థం కాలేదు వాడి మాటలు. అసలు మనం అక్కడికి వెళ్ళకూడదు. ఎంత చాకిరీ అయినా వీళ్ళకే చేయాలి. ఈ రెండు నెలల్లో ఒక్కసారైనా చెల్లెల్ని చూడడానికొచ్చాడా? అమ్మా పెట్టా పెట్టదు అడుక్కోతినవద్దన్నట్టుంది" అంది.

మర్నాడు మధ్యాహ్నామే సుమ ఫోన్ చేసింది



"మీరక్కడికి వెళ్ళి రెండు నెలలపైనే అయింది. నేనెంత చేసినా వదినకు తృప్తి లేకుండా ఉంది. నా చదువు సాగటంలేదు. మీరు త్వరగా వస్తారా? లేక నన్నే లేడీస్ హాస్టల్లోనో చేరిపొమ్మంటారా? అంతేకాదు. ఇక్కడేదో కుట్ర జరుగుతోంది. ఎవరెవరో యిల్లు చూచి పోతున్నారు. పెద్దన్నయ్య, ఈమధ్య చిన్నన్నకి తరచు ఫోన్ చేస్తున్నాడు'' అంటూ. కామేశం వెంటనే సమాధాన మిచ్చాడు "స్వంత ఆలోచనలు తీసుకునేంత పెద్దదానివేమీ కావు. మేము త్వరలోనే వస్తాం అంతవరకు ఏ ఆలోచనలు చేయకు'' అని.

"పెద్దాడు స్వంత యిల్లు కొనుక్కునేసరికి, చిన్నాడికీ ఇంటిమీద ధ్యాస కలిగింది. మనముండగానే 'నేనూ, నా పెళ్ళాం, నా యిల్లు' అంటూ ఎవరి గూడు వాళ్ళు వెతుక్కునేటట్టున్నారు. వీళ్ళకు ఏ బంధాలు అక్కరలేదు. మనల్ని మనింటిలోంచి తరిమేసేలోగా మనం జాగ్రత్తపడాలి. ఇక వీళ్ళకెంత చేసినా ఎడారిలో వాన కురిసినట్టే. పదండి. శారద దగ్గరకే పోదాం. వాళ్ళత్త మావ రాగానే దాన్ని వాళ్ళ కప్పగించి వైజాగ్ పోదాం'' అంది పార్వతమ్మ

హఠాత్తుగా సామాను సర్దుకుని బయలుదేరుతూంటే "నీవు పడే యాతన చూడలేక అన్నాను గాని, నిజంగా వెళ్ళి పొమ్మన్నానా అమ్మా'' అంటూ అడ్డుపడ్డాడు సీతారాం.

"నీవన్నావని కాదురా. అది ఒంటరితనంతో బాధ పడుతోంది. అందుకే రోజుకో కంప్లైంటు చేస్తోంది. ఓ నెల రోజులక్కడుండి వైజాగ్ వెళ్తాం'' అంది.

"మీరింకా నా కంప్యూటరు కోర్సు పూర్తయ్యే వరకు, కనీసం మూడు నెలలైనా ఉంటారనుకున్నాను'' అంది విమల వీధి గడప వరకు వస్తూ.

"చెప్పాను కదమ్మా! అక్కడికి ఇక్కడికి మగ్గంలో కండెలాగ తిరగలేకపోతున్నాను. మునుపటిలా ఆరోగ్యం లేదు. దాని తృప్తికోసం కొన్నాళ్ళక్కడుండి వైజాగ్ వెళ్తాం. అక్కడ వాళ్ళకి క్షణం పడదు. అది సరే. గడపదాటకముందే బొట్టు పెట్టు'' అంది.

అత్తగారలా అనగానే విమల గబగబా లోపలికి వెళ్ళి చిటికెడు కుంకుమ తెచ్చి పెట్టబోతూంటే "అలా కాదు. ముందు నువ్వు పెట్టుకొని ఎదుటివాళ్ళకు పెట్టాలి'' అంది పార్వతమ్మ. ."అదో రూలుంది కదూ'' అందూ అంటీఅంటనట్టు తనుపెట్టుకుని అత్తగారి నుదుటన మిగిలింది మెత్తింది.

సీతారాం ఆటో తెచ్చి 'తానెంతకు బేరమాడాడో' చెప్పి 'బై' చెప్పాడు.

ఆటో ముందుకు సాగుతూంటే పార్వతమ్మ కళ్ళు తుడుచుకుంది ప్రక్కకు తిరిగి.

"ఏమైంది?'' అడిగాడు కామేశం.

"కళ్ళలో కుంకం పడింది'' అంది పార్వతమ్మ

"నేనన్నానని కాదు ఇన్నాళ్ళు అహర్నిశలు ఆ కోడలి కెలా చేశావో, అంతకన్నా ఎక్కువగా ఇక్కడా చేశావే, మరి గడప దాటి వెళ్ళేటప్పుడు కనీసం చేతిలో ఓ పండైనా పెట్టాలని తోచలేదా పిల్లకి! మనం మాటి మాటికి కొనితెచ్చే స్వీట్లు పళ్ళు ఇంటి నిండా ఉన్నాయే. మనింటికొచ్చిన దెవరికైనా మనమిలాగే పంపామా! విమలే ఇలా ఉందా! అందరూ ఇలాగే ఉన్నారా? లోకం ఇలా మారిపోయిందా. రోజులు మారడమంటే యిదేనా?'' బాధపడుతూ అన్నాడు కామేశం.

"నేను పైకి అననని అంటున్నారా; ఎవరికీ ఏమీ తెలియక పోలేదు. అంతా మరచిపోండి. అక్కడైనా కాస్త ప్రశాంతంగా ఉందాం'' అంది పార్వతమ్మ.

తల్లిదండ్రుల్ని చూచి ఆనందించానంది శారద. రెండు రోజుల వరకు కూతురికి వండి పెట్టడం, సాయంత్రం వాకింగ్‌కి తీసుకెళ్ళడం తప్ప పెద్ద పనేమీ లేకపోయింది పార్వతమ్మకి. మూడో రోజు నుండి శారద భర్తవేపు బంధువులు చుట్టాలు శారదను చూడడానికి వచ్చిపోవడం మొదలుపెట్టారు. ఉదయం వచ్చి సాయంత్రం వెళ్ళేవాళ్ళు కొందరయితే, రెండు రోజులన్నా ఉండి శారదకు ఉచిత సలహా లిచ్చి వాళ్ళవాళ్ళ భయం గొల్పే అనుభవాలను చెప్పేవాళ్ళు మరికొందరు. అందరికీ శారదకు చేసినట్టే, కాఫీ టిఫిన్లు, భోజనాలు అమర్చి మర్యాదలు చేయటంతోటే కాలం సరిపోతోంది. ఓ రోజు రాత్రి పార్వతమ్మకి గుండెల్లో నొప్పి, ఆయాసం వచ్చాయి. కంగారు పడుతూ దగ్గరున్న డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళాడు. ఆయన పరీక్షించి "బలమైన ఆహారం, విశ్రాంతి కావాలి'' అంటూ సలహా యిస్తూ టానిక్కులు రాసి, పంపేడు.

"మనం ఎందుకొచ్చాం? ఏం జరుగుతోంది?'' అంటూ బాధపడ్డాడు కామేశం. వారం పదిరోజులు కూర్చుంటు, లేస్తూ పనులు చేసుకోసాగింది. కామేశం సీతారాంకు ఫోన్ చేశాడు. విమల ఫోనెత్తి అంతావిని "మామీద నింద వేస్తున్నారా? కూతురు కూతురు అంటూ అనారోగ్యం తెచ్చుకుంది గాని ఇక్కడ బాగానే ఉంది'' అంటూ ఫోన్ పెట్టేసింది. కామేశం నోరెత్తలేక పోయాడు. ఆ రాత్రే శారద అత్తగారు ఫోన్ చేశారు. "మేమిప్పుడల్లా రావటం అవదు. డెలివరీ టైముకి ప్రయత్నిస్తాము. శారద ఆరోగ్యం జాగ్రత్త. రెగ్యులర్ చెక్ అప్ చేయించండి'' అంటూ. అత్తగారు ఫోన్‌చేసి "మీ అమ్మానాన్న అక్కడున్నారుగా. నీకేం భయంలేదని'' ధైర్యం చెప్పింది. "ఎవరెవరికో సేవలు చేయడం కన్నా నా పిల్లలకే చేసుకుంటాను. పదండి. శారదతో వైజాగ్ పోదాం'' అంది పార్వతమ్మ. "నేనురాను. నా పిల్లల చదువు పోతుంది'' అంది శారద.

"ఈ ఎల్.కే.జీ, యూ.కే.జీ అక్కడా ఉన్నాయి పద అక్కడ ఇల్లు తగలబడిపోతోంది. వెళ్ళి కాచుకోవాలి'' అని చెప్పగానే కాసేపు గునిసి రా సిద్ధపడింది.

తత్కాల్‌లో రిజర్వేషన్ చేయించాలని బయలుదేరుతూంటే "నాన్నా! సుమకి, రాజీకి క్షణం పడటం లేదు. నేను వీళ్ళమధ్య వేగలేక పోతున్నాను. వేరే యిల్లు చూచుకున్నాను. త్వరగా మీరొస్తే మారతాం'' అంటూ రాజారామ్ ఫోన్ చేశాడు. కామేశం నవ్వుకున్నాడు. రిజర్వేషన్ కుదరగానే సీతారాంకి ఫోన్ చేశాడు. గోదావరి కదలడానికి పదినిముషాల ముందు సీతారాం వచ్చి 'పాఠం' వప్పగించినట్టు "తమ్ముడు బిల్డరునెవరినో చూశాట్ట. ఆ బొక్కియింటికి మరామత్తులకి ఎంత పెట్టినా ఒకటే. అపార్టుమెంటుకిచ్చేయండి. వాడికీ ఇల్లు కుదిరినట్టవుతుంది. అందులో మనకి నాలుగు వస్తాయ్'' అన్నాడు.

"అయితే నాకూ ఒకటి వస్తుంది కదమ్మా'' అంది శారద ఉత్సాహంగా.

"వస్తాయే. మీ నలుగురికీ నాలుగు వస్తాయి. మీవి మీకు యిచ్చేసి, తట్టా బుట్టా పట్టుకుని మేం ఏ అద్దెకొంపకో పోతాం'' అంది పార్వతమ్మ.

"అవేం మాటలమ్మా. మేమంతా లేం?'' అన్నాడు సీతారాం.

కామేశం కలగజేసుకుని

"వద్దురా. మేం ఎవరి దగ్గరా వుండలేం. ఉండి చాకిరీలు చేసి అనారోగ్యాల్ని తెచ్చుకోలేం. అందరికీ మెప్పులేని సేవ చేసిన మీ అమ్మ ఆరోగ్యం క్షీణించింది. విశ్రాంతి కోసమని వస్తే ఏం జరిగింది 'పెనం' మీద నుండి పొయ్యిలో పడినట్టుయింది. మా శక్తివంచన లేకుండా మిమ్మల్ని పెంచి, ప్రయోజకుల్ని చేశాం. ఇక మావల్ల కాదు. మాకు ఆస్తులు తప్ప ఆప్యాయతలు, మమకారాలు అక్కరలేదు. నేను యింటిని ఏ బిల్డరుకీ యివ్వను. మీ బాధలు మీరు పడండి. మమ్మల్నిలా ఉండనీండి'' అన్నాడు. సీతారాం దిమ్మెరపోయాడు.

"వెళ్ళొస్తాము రా! నీవు కోడలు పిల్లలు జాగ్రత్త'' అంది పార్వతమ్మ చెమ్మగిల్లిన కళ్ళతో గోదావరి ఎక్స్‌ప్రెస్ భారంగా ముందుకు పోతూంటే.

*



## లేత వయసులో ముదురు కబుర్లు

'పిట్ట కొంచెం కూత ఘనం' అన్నట్టు ఉన్నాయి హన్సిక మాటలు. వయసుకి చిన్నదే అయినా, మాటలు మాత్రం కోటలు దాటుతున్నాయి. ఇటీవల హన్సిక ఎక్కువ రెమ్యునరేషన్ డిమాండ్ చేస్తోందన్న పుకార్లు షికార్లు చేస్తున్నాయి. హీరోయిన్లు ఇలాంటి పుకార్లను అబద్ధాలే అంటూ కొట్టిపారేస్తుంటారు. హన్సిక మాత్రం ఆ విధంగా మాట్లాడడం లేదు. 'నా రేటెంతో నిర్మాతలకు తెలుసు. వారు ఇచ్చినంత పుచ్చుకుంటున్నాను. మధ్యలో మీకెందుకు అంత బాధ?' అంటూ ముదురు కబుర్లు చెబుతోంది. 'సక్సెస్‌ని బట్టి పారితోషికం ఉంటుంది. నాది 'గోల్డెన్ లెగ్' అన్నది అందరికీ తెలుసు. అందుకే నేను అడిగినంత ఇస్తున్నారు' అని గడుసుగా కూడా జవాబు చెబుతోంది.